సాక్షి తిరుపతి

శుక్రవారం : 30 : జూన్ : 2023



త్యాగానికి ప్రతీక బక్రీద్

జిల్లాలో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

- 8లో



టీటీడీ సంపూర్ణ సహకారం

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వేద పాఠశాలకు టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తుందని టీటీడీ ఈఓ తెలిపారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	27
చిత్తూరు	34	26
తిరుమల	31	22
గూడూరు	38	28
నగరి	36	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 71,615 మంది స్వామివారిని దర్శించుకోగా.. 30,219 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైలోని అరుణాచలంకు జూలై 2, 3 తేదీల్లో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్టు మంగళం ఆర్టీసీ డిపో మేనేజర్ కేసీజీ భాస్కర్ తెలిపారు. 20 సాధారణ బస్సులతోపాటు ఏసీ బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, సురక్షిత ప్రయాణం కోసం భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీలో 40 ఆన్‌కాల్ డ్రైవర్ ఉద్యోగాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్ (రోజువారీ వేతనం ప్రాతిపదికన) ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు డీపీటీఓ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. అవసరాన్ని బట్టి ఆయా డిపోల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా శ్రీకాళహస్తి డిపోలో పనిచేయడానికి 40 మంది డ్రైవర్లను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి (9959225673), జిల్లా ప్రజాసమాచార అధికారి ఎం.పార్థసారథి (9959225669)ని సంప్రదించాలని కోరారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తయిన వారు అర్హులన్నారు.

తహసీల్దార్ల నియామకం

తిరుపతి అర్బన్: జిల్లాలో పలువురు తహసీల్దార్లు నియమితులయ్యారు. రేణిగుంట తహసీల్దార్‌గా ఆర్‌వీ.ఉదయ్‌సంతోష్, ఏర్పేడు తహసీల్దార్‌గా ఎస్.శివప్రసాద్, శ్రీకాళహస్తి తహసీల్దార్‌గా ఎస్.ద్వారకానాథ్‌రెడ్డి నియమితులయ్యారు. మరోవైపు రేణిగుంట తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.భార్గవిని కలెక్టరేట్ డి సెక్షన్ సూపరింటెండెంట్‌గా మార్పు చేశారు. ఆ మేరకు చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. వారంతా శుక్ర, శనివారాల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం



మాట్లాడుతున్న మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో గురువారం ప్రొఫెసర్ ప్రశాంత్‌చంద్ర మహల్నోబిస్ 131వ జయంతిని పురస్కరించుకుని 17వ జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ వర్సిటీ గణాంక విభాగం, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఎస్వీయూ స్టాటిస్టిక్స్ పూర్వ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీ.భారతి పాల్గొన్నారు. ముందుగా భారత గణాంకాల పితామహుడు ప్రొఫెసర్ ప్రశాంత్‌చంద్ర మహల్నోబిస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ మహిళా వర్సిటీలో 2023–24విద్యా సంవత్సరం నుంచి స్టాటిస్టిక్స్‌లో నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఐఎస్‌పీఎస్ కన్సల్టెన్సీ సర్వీస్ సెల్‌ను ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఆర్.రామమూర్తి ప్రారంభించారు. మహిళా వర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగపు హెడ్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.శివపార్వతి, చెన్నై లయోలా కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ మార్టిన్ లూథర్ విలియమ్స్, ప్రొఫెసర్ ఈ.సత్యనారాయణ, ఐఎస్‌పీఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆర్.రాజశేఖర్‌రెడ్డి, ఈసీ సభ్యులు డాక్టర్ పీ.లావణ్యకుమారి పాల్గొన్నారు.

గడ్డి ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు

తిరుపతి అర్బన్: గడ్డి ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతిలోని టీటీడీ గోశాల, అక్కారంపల్లి వద్దనున్న లెప్రసీ హాస్పిటల్ పరిధిలోని 25 ఎకరాల భూమిలో నిర్వహిస్తున్న దేశీఆవుల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై జూమ్ మీటింగ్ ద్వారా టీటీడీ జేఈవోతో సమీక్షించారు. ఈ సందర్భంగా గడ్డి ఉత్పత్తికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, ఆర్‌వైఎస్‌ఎస్ జిల్లా డీపీఎం మునిరత్నం పాల్గొన్నారు.

పసిడి పంట

బంగారు నిక్షేపాలు కుప్పం నియోజకవర్గంలో పుష్కలంగా ఉన్నాయి. గుడిపల్లె మండలంలోని మల్లప్పకొండలో ఐదు దశాబ్దాల క్రితమే గుర్తించి తవ్వకాలు ఆరంభించినా అప్పటి నిర్వాహకులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూతపడ్డాయి. కోట్ల రూపాయల వస్తుసామగ్రి తుప్పుపట్టాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం స్థానికుల సమస్యలతోపాటు విలువైన ఖనిజాన్ని వెలికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. ఈ మేరకు మళ్లీ బంగారు గనులు ప్రారంభించేందుకు చర్యలు ముమ్మరం చేశాయి. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి.

- కుప్పంలో బంగారం నిక్షేపాలు
- చిగరగుంట, బిసానత్తంలో 18 లక్షల టన్నుల బంగారం
- టన్ను ఖనిజం నుంచి 5 గ్రాములకుపైగా బంగారం
- ఖనిజ ఉత్పత్తికి ముందుకు వచ్చిన ఎన్ఎండీసీ సంస్థ
- రూ.500 కోట్లతో బంగారం గనుల తవ్వకాలు





బంగారు కొండ: బంగారు నిక్షేపాలున్న మల్లప్పకొండ(ఇన్‌సెట్) తుప్పపడుతున్న యంత్రాలు

ఏపీ నెట్‌వర్క్

ఆంధ్రప్రదేశ్‌లో బంగారం పంట పండనుంది. చిత్తూరు జిల్లా కుప్పం పరిధిలోని గుడుపల్లి మండలం చిగరగుంట, బిసానత్తం అటవీప్రాంతంలో 18 లక్షల టన్నులకు పైగా బంగారం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ నిక్షేపాలను వెలికి తీసేందుకు ఎన్ఎండీసీ సంస్థ ముందుకొచ్చింది. కర్ణాటక రాష్ట్రంలోని కేజీఎఫ్‌లో బంగారు గనులు కరిగిపోవడంతో.. కొత్త గనుల కోసం అన్వేషణ సాగుతోంది.



నా పేరు నారాయణప్ప. మా ఊరు సంగనపల్లె. గతంలో చిగరగుంట అటవీ ప్రాంతంలోని బంగారు గనుల్లో నాలుగేళ్లు పనిచేశా. తర్వాత 2001లో గనులు మూతపడ్డాయి. అప్పటి నుంచి ఉపాధిలేక అష్టకష్టాలు పడుతున్నా. ఇప్పుడు సీఎం జగనన్న వల్ల మళ్లీ బంగారు గనులు ప్రారంభిస్తారని చెబుతున్నారు. త్వరగా ప్రారంభిస్తే ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



మాది సంగనపల్లె. నా పేరు గవస్కర్‌రాజు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆయన నియోజకవర్గంలో బంగారు గనులు ఉన్నా కూడా పట్టించుకోలేదు. అవి మూతపడుతున్నా చేతులుముడుచుకుని కూర్చున్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగనన్న హయాంలో బంగారు గనుల తవ్వకాలకు సర్వేలు చేస్తున్నారు. గనులు ప్రారంభిస్తే మూడువేల మందికిపైగా ఉపాధి లభిస్తుంది.

భారత్ గోల్డ్ మైన్స్ చేపట్టిన సర్వేలో చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలంలోని చిగరగుంట, బిసానత్తం, పెద్దపర్తిగుంట, సంగనపల్లి, బూరుగులపల్లి, చిన్నగొల్లపల్లి, అత్తినత్తం గ్రామాల పరిధిలో బంగారం ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు.

55 ఏళ్ల క్రితమే ప్రారంభం

1968 నుంచి గుడుపల్లి మండల పరిధిలోని ఏడు గ్రామాల్లో తవ్వకాలు ప్రారంభించారు. ముఖ్యంగా బిసానత్తం గనిని, 1978లో చిగురుకుంట గనిని ఎంఈసీఎల్ సంస్థ ప్రారంభించింది. ఈ సంస్థ పదేళ్లపాటు ఖనిజాన్ని వెలికి తీసి కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్)లోని బీజీ ఎంఎల్ (భారత్ గోల్డ్ మైనింగ్ లిమిటెడ్)కు అందజేస్తూ వచ్చింది. కాలక్రమేణా ఎంఈసీఎల్ సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవడంతో గనులను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీజీఎంఎల్ 1982లో కొనుగోలు చేసింది. అప్పటి నుంచి 2001 జనవరి 15 వరకు బంగారు ముడి ఖనిజం వెలికి తీసే పనిని చేపట్టింది. బీజీఎంఎల్ సంస్థ ఈ గనుల తవ్వకం ద్వారా మంచి లాభాలు గడించింది. అయితే, కేజీఎఫ్‌లో ఇదే సంస్థ నిర్వహిస్తున్న ఛాంపియన్ గనిలో నష్టాలు రావడంతో పాటు చిగరుకుంట, బిసానత్తం గనుల్లోనూ కొందరు తప్పుడు లెక్కలు చూపి అవినీతికి పాల్పడడంతో లాక్‌అవుట్ చేశారు. దీంతో బంగారు గనుల తవ్వకాలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికులు వీధినపడ్డారు. అప్పట్లో కుప్పం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నా కార్మికుల గోడు పట్టించుకున్న పాపాన పోలేదు. లాక్ అవుట్ తర్వాత దాదాపు 400 మంది ఉద్యోగులు కోర్టుకు వెళ్లి పెన్షన్లు సాధించుకున్నారు.

పెద్ద చెరువుతో పెనుముప్పు

చిగరగుంట బంగారు గనికి ఆనుకుని టీడీపీ హయాంలో పెద్ద చెరువు నిర్మించారు. దీనివల్ల పెద్దగా ప్రయోజనం లేదు. గుడిపల్లె మండలంలోని ఓఎన్‌కొత్తూరు పంచాయతీ పరిధిలోని 50 ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. మిగిలిన నీరు తమిళనాడుకు వెళ్తుంది. ఎప్పుడూ ఈ ప్రాజెక్టులో నీళ్లు ఉండడంతో గనుల తవ్వకానికి ఆటంకం ఏర్పడింది. అప్పటి పాలకులకు మొత్తుకున్నా వినిపించుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. తమ్ముళ్ల జేబులు నింపుకునేందుకు ప్రాజెక్టు నిర్మించారని స్థానికులు విమర్శిస్తున్నారు.

సీఎం జగన్ ప్రత్యేక చొరవ

చిగరుకుంట బంగారు గనుల తవ్వకాలను తిరిగి చేపట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. గనుల తవ్వకాలు ప్రారంభిస్తే స్థానికులకు ఉపాధితో పాటు పంచాయతీలకు ఆదాయం రానుంది. గనులు లాక్ అవుట్ చేసే నాటికి 1,500 మంది కార్మికులు, సిబ్బంది పని చేసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిగురుకుంట, బిసానత్తం ప్రాంతాల్లో గనులు సాగాలంటే 3 వేల మంది సిబ్బంది కావాల్సి ఉంటుంది. వీరిలో 1,500 గని కార్మికులు మరో 1,500 మంది నిపుణులు, ఉద్యోగులు కావాల్సి ఉంటుంది. దీంతో స్థానికులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.

18 లక్షల టన్నులు లక్ష్యం

బంగారు ఖనిజం తవ్వకాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎండీసీ లిమిటెడ్ సిద్ధమవుతోంది. మొదటి విడతలో దీనిపై రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. గుడుపల్లె మండలంలోని చిగరగుంట, బిసానత్తం బంగారం గనుల్లో 18 లక్షల టన్నుల బంగారం ఖనిజం ఉన్నట్లు ఎన్ఎండీసీ అంచనా వేసింది. ఒక్కో టన్ను ఖనిజం నుంచి ఐదు గ్రాములకు పైగానే బంగారం లభిస్తుందని ఎన్ఎండీసీ లిమిటెడ్ భావిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మైనింగ్ లీజు తీసుకుని, పర్యావరణ అనుమతి సాధించి, ఇతరత్రా అనుమతులన్నీ తీసుకొని రెండేళ్లలో తవ్వకాలు ప్రారంభించాలని భావిస్తోంది. ఈ మొత్తం అనుమతుల ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకువెళ్లడానికి ఒక కన్సల్టింగ్ సంస్థను ఎంపిక చేస్తారని తెలుస్తోంది. ఇప్పటికే ఎన్ఎండీసీ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వజ్రాల గని నిర్వహిస్తోంది. ఛత్తీస్‌ఘఢ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఇనుప ఖనిజాన్ని తవ్వి తీస్తోంది.



బంగారు కొండ వివరాలు

అటవీ ప్రాంతం: చిగరగుంట (మల్లప్ప కొండ)

విస్తీర్ణం ఎకరాలలో 640

బంగారు నిక్షేపాలు ఉన్న ప్రాంతాలు: సంగనపల్లె, ఓఎన్‌కొత్తూరు పంచాయతీలు

వెలికితీసే బంగారం మొత్తం: 18 లక్షల టన్నులు

టన్నుకు లభించే బంగారం: 5.5 గ్రాములు

తవ్వకాలు ప్రారంభించే సంస్థ: ఎన్ఎండీసీ లిమిటెడ్

ప్రత్యక్ష, పరోక్షంగా లభించే ఉద్యోగాలు : 3వేలు

టన్నుకు 5.5 గ్రాముల బంగారం



బంగారు నిక్షేపాలు తీసే గని

చిగరుకుంట, బిసానత్తంలో 640 ఎకరాల విస్తీర్ణంలో బంగారం ముడిఖనిజం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక టన్ను ముడిపదార్థం నుంచి 5.5 గ్రాముల బంగారం లభిస్తుందని అంచనా. గనుల ప్రదేశంలోనే బంగారు శుద్ధి ప్లాంట్‌కు ఎన్ఎండీసీ సంస్థ సన్నాహాలు చేసుకుంటోంది.

వినియోగంలోకి భారీ సామగ్రి



నిరుపయోగంగా యంత్ర సామగ్రి

ముఖ్యమంత్రి నిర్ణయంతో గనుల్లో మూలన పడిన రూ.కోట్ల విలువైన సామగ్రి వినియోగంలోకి రానుంది. ఈ రెండు గనుల ప్రాంతాల్లో 8 సొరంగ మార్గాలు ఉండగా, ఇందులో రెండు బంగారు ముడిఖనిజం బయటకు తెచ్చేందుకు, మిగతా 6 కార్మికుల రాకపోకలు, వ్యర్థాలు వెలికితీతకు వినియోగించనున్నారు.

ఆమే ఆధారం!



కాలం మారింది. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన కొందరు మహిళలు బయటకొస్తున్నారు. తల్లిదండ్రుల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారు. భర్తకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పిల్లల పోషణకు తమవంతు బాధ్యతలు నెరవేర్చుతున్నారు. బిడ్డల పెళ్లిళ్లు.. ఉద్యోగాల వరకు నెట్టుకొస్తున్నారు. పెద్దగా చదువుసంధ్యలు లేకపోయినా దిగులు చెందక.. కష్టాన్నే నమ్ముకుంటున్నారు. తమకు తోచిన రంగాన్ని ఎంచుకుని గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కొన్ని పురుషులకే పరిమితమైన రంగాల్లోనూ ప్రతిభకనబరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో ఇలాంటివారు పదుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళా మహరాణులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి, తిరుపతి

- విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- కష్టమైనా ఇష్టంగా మలుచుకుంటూ ముందుకు
- కుటుంబ పోషణలో భాగస్వామ్యం
- పదుగురికి ఆదర్శంగా..

అందరికీ నోటీపై



టీ దుకాణం నడుపుతున్న లక్ష్మీదేవి

తిరుపతి కొర్లగుంటలో నివాసం ఉంటున్న లక్ష్మీదేవి పదేళ్లుగా టీ దుకాణం నడుపుతున్నారు. తండ్రి పాడి రైతు. పితికిన పాలను లక్ష్మీదేవి టీ అంగళ్లకు విక్రయించేవారు. అదే సమయంలో టీ, కాఫీ కొట్టు పెడితే బాగుంటుందని భావించారు. నివాసానికి సమీపంలో సొంతంగా టీ దుకాణాన్ని నడపడం ప్రారంభించారు. టీ, కాఫీని రుచిగా తయారు చేస్తుండడంతో డిమాండ్ పెరిగింది. రోజూ 500 మంది వరకు టీ, కాఫీ తాగి వెళ్తున్నారని.. ఈ దుకాణమే ఇప్పుడు తమ జీవనాధారమని చెబుతున్నారు. భర్త ప్రకాష్ చేదోడు వాదోడుగా ఉంటున్నారని, ఇద్దరు కుమారులను చదవించి ప్రయోజకుల్ని చేశానని అంటున్నారు. ఇద్దరు కుమారులు ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నట్టు పేర్కొన్నారు.



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నాదస్వరం ఊదుతున్న రెడ్డెమ్మ

తిరుపతి కొర్లగుంటలో ఉంటున్న రెడ్డెమ్మ తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సుమారు పదేళ్లుగా నాదస్వర విద్వాంసురాలుగా పనిచేస్తున్నారు. ఈమె పుట్టింది పెరిగింది అన్నమయ్య జిల్లా పీలేరు. తండ్రి మల్లయ్య నాదస్వర విద్వాంసులు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలుకాగా పెద్ద కుమార్తె రెడ్డెమ్మ. రెండో కుమార్తె సుభాషిణి. తన తండ్రి వద్ద రోజుకు 40 మందికిపైగా నాదస్వరంలో శిక్షణ తీసుకునేవారు. వారితోపాటే రెడ్డెమ్మ, సుభాషిణి నాదస్వరం నేర్చుకున్నారు. తిరుపతి సంగీత కళాశాలలో డిప్లొమో పూర్తిచేశారు. కాగా రెడ్డెమ్మను తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నాదస్వర విద్వాంసురాలుగా దేవదాయశాఖ నియమించింది. సుమారు పదేళ్లుగా ఆమె విధులు నిర్వహిస్తూ భక్తుల ప్రశంసలు అందుకుంటున్నారు. నాన్న నేర్పిన నాదస్వరం ఇప్పుడు జీవనాధారమైందని, ప్రభుత్వ ఉద్యోగిగా వేతనం తీసుకుంటూ.. కుమార్తెకు వివాహం జరిపించానని చెబుతోంది. తన భర్త విశ్వనాథం కూడా నాదస్వర విద్వాంసులే కావడం విశేషం. సోదరి సుభాషిణి కూడా నాదస్వరంలో రాణిస్తున్నట్లు రెడ్డెమ్మ ఆనందం వ్యక్తం చేశారు.



చెవిపోగులు కుదుతున్న సునీత



చెవిపోగులు కుదుతున్న గజలక్ష్మి

వారసులొచ్చారు

తండ్రి తదనంతరం ఆస్తులు, ఉద్యోగాలతోపాటు అనేక కార్యక్రమాలకు కుమారులే వారసులుగా వ్యవహరిస్తుంటారు. తిరుమల కళ్యాణకట్టలో కొందరు మహిళలు తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ.. పురుషులతో దీటుగా రాణిస్తున్నారు. శ్రీవారి భక్తుల తలనీలాలు సమర్పించుకునే కార్యక్రమంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. అదేవిధంగా చెవిపోగులు కుట్టే కార్యక్రమంలోనూ పాలుపంచుకుంటున్నారు. ఇలా తిరుమలలో సునీత, గజలక్ష్మి 12 ఏళ్లుగా చిన్నారులకు చెవిపోగులు కుట్టే వృత్తిలో రాణిస్తుంటే.. లత, నిర్మల, నాగలక్ష్మి వంటి మహిళలు క్షురకులుగా వారి వారి వృత్తుల్లో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

4న చిత్తూరుకు సీఎం రాక



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం

సాక్షి, చిత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 4వ తేదీన చిత్తూరు రానున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో చిత్తూరు పరిధిలోని చీలాపల్లి క్రిస్టియన్ మెడికల్ కళాశాల (సీఎంసీ) ఆస్పత్రి ఆవరణకు చేరుకుంటారు. అక్కడ 300 పడకల ఆస్పత్రికి భూమి పూజ చేస్తారు. అనంతరం విజయా డెయిరీ వద్ద అమూల్ సంస్థ ఏర్పాటు చేసే నూతన యూనిట్‌కు భూమి పూజ చేయనున్నారు. ప్రశాంత్ నగర్‌లోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారు. ఈ నేపథ్యంలో గురువారం ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, సీఎం పర్యటనల సలహాదారు తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు క్షేత్రస్థాయిలో పర్యటించారు. అనంతరం సీఎం పర్యటన విజయవంతం చేయడం కోసం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటన తుది వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

యువ పారిశ్రామికవేత్త ఆత్మహత్య



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

వాకాడు: వాకాడు మండలం, కోడివాక గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త వాకాటి అశోక్‌రెడ్డి(41) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం..కుటుంబ కలహాల నేపథ్యంలో అశోక్‌రెడ్డి మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఎవ్వరూ లేని సమయంలో తన గదిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, అలాగే వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

తిట్టడమే పవన్ మేనిఫెస్టో

- మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో తొలగించిన ఘనుడు చంద్రబాబు
- అరటిపండు కనిపెట్టింది తన తండ్రే అంటున్న నారా లోకేష్
- పౌరసరఫరాల శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సీఎం
- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తిరుపతి అర్బన్: తిట్టడమే పవన్‌కల్యాణ్ మేనిఫెస్టోగా మారిందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన తిరుపతి పద్మావతీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పులు చూపుతా.. తాటతీస్తా.. తోలుతీస్తా.. బట్టలు ఊడదీసి కొడతా.. ఇంటిలో నుంచి లాగి కొడతా.. అంటూ అదే తన మేనిఫెస్టోగా పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లోకి వచ్చిన వారు తాము ఎదగాలని భావిస్తారని, అయితే పవన్‌కల్యాణ్ మాత్రం చంద్రబాబు చంకనెక్కే పనిలోనే ఉన్నారంటూ మండిపడ్డారు. గతంలో చంద్రబాబు తమ కుటుంబ సభ్యులను తిట్టాడంటూ చెప్పకొచ్చారు. ఇప్పుడు ఆయన్ను ముఖ్యమంత్రి చేయడానికి తిరుగుతున్నారనీ, ఇదే పవన్ పరిస్థితి అంటూ వివరించారు. నారా లోకేష్ ఇటీవల మాట్లాడుతూ అరటి పండు ప్రపంచం మంతా వెళ్లిందంటే ఆనాడు తన తండ్రి చంద్రబాబు నాయుడు వేసిన విత్తనమే కారణమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పప్పు, ముద్దపప్పు అని మరోసారి నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంకలా మారిపోతుందని వ్యాఖ్యానించిన చంద్రబాబునాయుడు ఇటీవల మేనిఫెస్టోలో అంతకన్నా ఎక్కువ పథకాలు ఇచ్చామని చెప్పడాన్ని తప్పుపట్టారు. అప్పుడు రాష్ట్రం శ్రీలంక కాదా అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచే తొలగించిన ఘనుడుగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో ప్రకారం ప్రతి హామీని నెరవేర్చి పేదలకు దగ్గరయ్యాని గుర్తుచేశారు.

పౌరసరఫరాలశాఖలో విప్లవాత్మక మార్పులు

పౌరసరఫరాలశాఖలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని మంత్రి చెప్పారు. గతంలో చంద్రబాబు సివిల్ సప్లయిస్‌కు చెందిన రూ.13,500 కోట్లు ఇతర రంగాలకు మళ్లించారని తెలిపారు. ప్రధానంగా రూ.4,900కోట్లు పసుపు కుంకానికి మళ్లించారని విమర్శించారు. దీంతో ఆ శాఖ అస్తవ్యస్థంగా మారి అప్పుల ఊబిలో కూరుకుందని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని శాఖలను బలోపేతం చేస్తూ దారిలో పెట్టారని చెప్పారు. తాజాగా జూలై 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చౌకదుకాణాల్లో గోదుమపిండి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గం పుంగనూరు నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. మరోవైపు రాగులను పాత రాయలసీమ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామని చెప్పారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇస్తామని వెల్లడించారు. కందిపప్పును గతంలో గిరిజన ప్రాంతాల్లో ఇచ్చేవారని.. అయితే ప్రస్తుతం రాష్ట్రమంతటా ఇస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. చిరుధాన్యాలను ప్రోత్సహిస్తున్నామని, టమాటాకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఆయనతోపాటు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ వై.సుమతి, జిల్లా అధికారి శేషాచలం రాజు తదితరులున్నారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,900
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,379
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,200
రిటైల్ వెండి గ్రాము	రూ.73.20

కపిలేశ్వరుని పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం నుంచి జూలై 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న పవిత్రోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి శ్రీవిఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టారు. పవిత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం పవిత్ర ప్రతిష్ఠ, జూలై ఒకటో తేదీ గ్రంధి పవిత్ర సమర్పణ, రెండో తేదీ మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. చివరి రోజు సాయంత్రం 6 గంటలకు పంచమూర్తులైన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వర స్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామివార్లకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

తిరుపతి కల్చరల్: త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, నగరి, పుత్తూరు, చంద్రగిరి, పాకాల తదితర ప్రాంతాలలోని మసీదులు, ఈద్గాలలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందాన్ని పంచుకున్నారు. తదనంతరం దానధర్మాలు చేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు స్వీకరించారు. ఇందులో భాగంగా తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో ఉదయం 8.30 గంటలకే ముస్లింలు సామూహిక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఈద్గా మైదానానికి చేరుకొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్‌షఫీ అహమద్ ఖాదరి, కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఇమామ్, అయూబ్‌ఖాన్, వివిధ మసీదుల ముతవల్లీలు, మాలిక్, చాంద్ బాషా, ఇస్మాయిల్, రఫీ హిందుస్థానీ, మౌలా, అన్సర్‌బాషా, బషీర్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ ఇమ్రాన్, చోటాభాయ్, ముస్లిం జేఏసీ చైర్మన్ ముర్తుజా పాల్గొన్నారు.

ప్రాణదాన పథకానికి 86 మంది రోగుల ఎంపిక

తిరుపతి తుడా: స్విమ్స్ టీటీడీ ప్రాణదాన పథకం కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేసేందుకు 86 మంది పేద రోగులను ఎంపికచేసినట్లు డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. స్విమ్స్‌లోని సమావేశ మందిరంలో గురువారం ప్రాణదాన కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా రోగుల స్థితిగతులు, రేషన్‌కార్డు కలిగి బిలో ప్రాపర్టీ కలిగిన రోగులను ప్రాణదాన పథకానికి ఎంపిక చేసినట్లు డాక్టర్ వెంగమ్మ తెలిపారు. ఇందులో కార్డియో థొరాసిక్‌కు- 15 మంది, కార్డియాలజీకి నలుగురు, డెర్మటాలజీకి ఒకరు, జనరల్ సర్జరీకి ముగ్గురు, మెడికల్ అంకాలజీకి నలుగురు తదితరులు ఉన్నట్టు తెలిపారు.

కల్యాణ వెంకన్న వేద పాఠశాలకు టీటీడీ సంపూర్ణ సహకారం



స్నాతకోత్సవంలో పాల్గొన్న వేద విద్యార్థులు, తల్లిదండ్రులు



విద్యార్థులకు నగదు, వెండి డాలరు, యోగ్యతా పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, టీటీడీ ఈఓ

- వేద పరిరక్షణలో చెవిరెడ్డి దంపతుల కృషి అభినందనీయం
- టీటీడీ ఈఓ ధర్మారెడ్డి
- ఏడాదిన్నరలో ప్రపంచంలోనే అతిపెద్ద వేద పాఠశాల
- ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- వేడుకగా కల్యాణ వెంకన్న వేద పాఠశాల మొదటి స్నాతకోత్సవం
- ఒక్కొక్క విద్యార్థికి రూ.3 లక్షల నగదు, వెండి డాలరు, యోగ్యతాపత్రం

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వేద పాఠశాలకు టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తుందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. తుమ్మలగుంటలోని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న శ్రీకల్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల మొదటి స్నాతకోత్సవం గురువారం వైభవంగా సాగింది. ఈవేడుకకు టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 8 సంవత్సరాల పాటు శుక్ల, యజుర్వేదం విద్యను అభ్యసించిన విద్యార్థులకు యోగ్యతా పత్రాలను అందజేశారు. చెవిరెడ్డి సొంత నిధులతో ఒక్కొక్క విద్యార్థికి రూ.3 లక్షల నగదు, 10 గ్రాముల వెండి డాలరును బహూకరించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ వేదవిద్య పరిరక్షణ బాధ్యత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు తీసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. వేద పాఠశాల నిర్వహణ చాలా కష్టతరమైనదని, అయినా చెవిరెడ్డి దంపతులు వేద పాఠశాల నిర్వహణకు సంకల్పించడం అభినందనీయమని కొనియాడారు. నేటి కాలంలో చెవిరెడ్డి వంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. ఏ పని అయినా ముందుండి కష్టపడి ఇలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగే వ్యక్తులను తన 58 ఏళ్ల కాలంలో ఎక్కడా చూడలేదన్నారు. నలుగురు విద్యార్థులతో ప్రారంభమైన వేద పాఠశాలను నేడు 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దేందుకు సంకల్పించడం శుభ పరిణామమన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు, స్వామిపై చెవిరెడ్డికి ఉన్న అపారమైన నమ్మకంతో వేద పాఠశాల విజయవంతంగా అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. టీటీడీ తరపున తుమ్మలగుంట వేద పాఠశాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

శ్రీవారి కటాక్షంతోనే వేద పాఠశాల

తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల నిర్వహణ దైవ సంకల్పమని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ గ్రామంలో అయితే భగవంతుడికి మూడు పూటలా నైవేద్యం పెడతారో.. ఆ గ్రామంలో ప్రజలకు ఆహార కొరత ఉండదన్న టీటీడీ మాజీ ఈఓ అజయ్‌కల్లాం మాటలతోనే శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పునాది పడిందని గుర్తుచేశారు. ఆ తరువాత అనేక నిర్మాణాలు వాకింగ్ ట్రాక్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వ్యాయామం చేసి, వ్యాయామశాలను ప్రారంభించారని వెల్లడించారు. ఈ క్రమంలోనే వేద పాఠశాల నిర్వహణకు అడుగులు పడ్డాయన్నారు. నేడు దాదాపు 200 మంది విద్యార్థులకు చేరడం దైవ సంకల్పమేనన్నారు. పాఠశాలకు టీటీడీ వేదిక్ యూనివర్సిటీ గుర్తింపు ఇచ్చిందని చెప్పారు. టీటీడీ వేద పారాయణ పథకం కింద అధ్యాపకుల నియామకానికి సహకారం అందించేందుకు టీటీడీ పాలక మండలి ఆమోదం లభించిందని తెలిపారు. దేశంలోనే కాక, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 25 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద వేద పాఠశాలను తుమ్మలగుంటలో నిర్మించనున్నట్లు తెలిపారు. వేద పాఠశాల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందించాలని ధర్మారెడ్డిని కోరారు. ఉద్యోగ విరమణ అనంతరం వేద పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. జయేంద్ర సరస్వతి, చిన్నజీయర్ స్వామి తుమ్మలగుంట వేదపాఠశాలకు విచ్చేసి వేద విద్య ఆవశ్యకతను తెలియజేశారని గుర్తుచేశారు. తుమ్మలగుంట వేద పాఠశాల చైర్‌పర్సన్ చెవిరెడ్డి లక్ష్మి, ప్రిన్సిపల్ బ్రహ్మాజీ శర్మ, వేదిక్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధేశ్యామ్, టీటీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ విభీషణ శర్మ, వేదిక్ యూనివర్సిటీ అధికారులు ముప్తి పవన్, ఫణియాజుల, కేంద్రీయ సంస్కృత విద్యా పీఠం ప్రొఫెసర్ రాఘవన్, తుడా సెక్రటరీ లక్ష్మి తదితరులు ప్రసంగించారు.

యువనేతకు శుభాకాంక్షల వెల్లువ

- పండుగ వాతావరణంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మోహిత్‌రెడ్డికి వేద ఆశీర్వాదం



గజమాలతో సత్కరిస్తున్న సుధాయాదవ్, రూరల్ నాయకులు



చంద్రగిరిలో 500 కిలోల భారీ కేక్‌ను కట్ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'నాయకా.. వర్ధిల్లు నూరేళ్లు..' అంటూ తమ అభిమాన యువనేతను దీవించారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం అంబరాన్ని తాకాయి. అన్నివర్గాల ప్రజలు తుమ్మలగుంటకు చేరుకుని తమదైన శైలిలో ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రధానంగా తుమ్మలగుంట గ్రామంలో ఆయన ఇంటి వద్ద జన సందడి కనిపించింది.

భారీ కేక్ కటింగ్

చంద్రగిరి మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ద్రాక్ష పండ్లతో తయారు చేసిన 500 కేజీల భారీ కేక్‌ను మోహిత్‌రెడ్డి కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అంతకుముందు చంద్రగిరి కొత్తపేట నుంచి భారీ ర్యాలీగా మోహిత్‌రెడ్డిని పార్టీ కార్యాలయానికి తీసుకువెళ్లారు.

తిరుచానూరులో మెగా రక్తదాన శిబిరం

తిరుచానూరు పంచాయతీ పరిధిలో సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మోహిత్‌రెడ్డి అభిమానులు రక్తదాన శిబిరం వద్దకు చేరుకుని భారీ ఎత్తున రక్తమిచ్చారు.

సందడే.. సందడి

మోహిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వందలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బాణసంచా పేల్చి భారీ క్రేన్ సాయంతో గజ మాలలతో సత్కరించారు. అలాగే పుష్ప గుచ్ఛాలతో శుభాకాంక్షలు చెప్పి అంతా మంచి జరగాలని ఆశీస్సులు అందించారు. వేద పండితుల ఆశీర్వచనాలు, మహిళల దీవెనలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

గంగమ్మను దర్శించుకోవడం మహద్భాగ్యం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామసుందర్



జస్టిస్ బి.శ్యామసుందర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామ దేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకోవడం మహద్భాగ్యమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామసుందర్ తెలిపారు. గురువారం జస్టిస్ బి.శ్యామసుందర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. దర్శనానంతరం జస్టిస్ శ్యామసుందర్ మీడియాతో మాట్లాడుతూ గంగమ్మతల్లిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో తిరుపతిలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించానని, అప్పట్లో అనేకసార్లు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నానని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయం అద్భుత రీతిలో నిర్మితమై చాలా బాగుందన్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. భక్తుల కల్పవల్లి గంగమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.